సాక్షి
తిరుపతి
సోమవారం, 30, జూన్, 2025



ఇంటర్వ్యూకు రాకుంటే తొలగిస్తాం

అకడమిక్ కన్సల్టెంట్లు ఇంటర్వ్యూకు రాకుంటే విధుల నుంచి తొలగిస్తామని ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆదేశాలు జారీ చేశారు. - 8లో



కళ్లు కాయలు

ఉమ్మడి జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. గుజ్జు ఫ్యాక్టరీల ముందు పడిగాపులు కాయాల్సి వస్తోంది. - 8లో



ముగియనున్న బదిలీల ప్రక్రియ

ఉమ్మడి జిల్లా పరిధిలో సాగుతున్న సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ సోమవారంతో ముగియనుంది. - 8లో

న్యూస్‌రీల్

పరిశోధనకు గణాంక శాస్త్రమే కీలకం



మహల్నోబిస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ : పరిశోధన రంగంలో గణాంక శాస్త్రం కీలక పాత్ర పోషిస్తుందని మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నేషనల్ స్టాటిస్టిక్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత గణాంకశాస్త్ర పితామహుడు ప్రశాంత్ చంద్ర మహల్నోబిస్ చిత్రపటానికి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ తిరుపతి ఐఎస్‌పీఎస్‌లో డేటా సైన్స్ సెంటర్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సెంటర్ వర్తమాన గణాంకవేత్తలకు నాలెడ్జ్ హబ్‌గా మారాలని ఆకాంక్షించారు. ఐఎస్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ పి.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ డేటా సైన్స్ సెంటర్ అనువర్తిత పరిశోధకులకు కన్సల్టెన్సీ కేంద్రంగా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గణాంకవేత్త ప్రొఫెసర్ వెంకట్ ఇక్కుర్తి, ప్రొఫెసర్ ఎస్ బాలకృష్ణ, యూబీఐ రీజనల్ హెడ్ ఎల్ఎస్‌వీఆర్ శర్మ, యూనియన్ బ్యాంక్ తిరుపతి జోనల్ హెడ్ శ్రీనివాస కుమార్, ఎస్వీయూ మాజీ రెక్టార్ సాంబశివారెడ్డి, ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, డాక్టర్ చంద్రమౌళి, ప్రొఫెసర్ విశ్వనాథన్, ప్రొఫెసర్ పార్థసారధి, డాక్టర్ శివపార్వతి పాల్గొన్నారు.

శ్రీశక్తి పీఠంలో టీటీడీ చైర్మన్



అమ్మవారి సేవలో బీఆర్ నాయుడు దంపతులు

రామచంద్రాపురం : రాయలచెరువు సమీపంలో వెలసిన శ్రీశక్తిపీఠాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దంపతులు ఆదివారం సందర్శించారు. వారాహీ నవరాత్రులను పురస్కరించుకుని పాతాళ శ్వేత వారాహి క్షేత్రంలో అమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే మరకత శక్తి కాళీదేవి, మరకత సిద్ధేశ్వరస్వామివారిని సేవించుకున్నారు. అనంతరం శ్రీశక్తి పీఠాధీశ్వరీ మాతాజీ రమ్యానంద భారతి స్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ మాతాజీని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయనను శక్తి పీఠం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. వైదేహీమాలను బహూకరించారు.

సిరులతల్లికి వెండి తుంగవాలికలు



వెండి వస్తువులను అందిస్తున్న దాతలు

చంద్రగిరి: తిరుచానూరు పద్మావతీదేవికి భక్తులు రెండు వెండి తుంగవాలికలను (గొలుసు దీపాలు) విరాళంగా అందజేశారు. ఆదివారం హైదరాబాదుకు చెందిన శ్రీవారి భక్తుడు వీరాంజనేయులు రూ.3.27లక్షల విలువైన సుమారు 3 కిలోల బరువు గల వెండి తుంగవాలికలను కుటుంబ సభ్యులతో కలసి ఆలయ ఏఈఓ. దేవరాజులుకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

- వెంకటగిరికి చెందిన చెంచయ్య ఓ ప్రైవేటు కంపెనీలో చిరుద్యోగి. ఇద్దరు పిల్లలు. కుమారుడు ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. తిరుపతిలో ఇంటర్ బైపీసీతో పాటు నీట్ కోచింగ్ ఇచ్చే కార్పొరేట్ సంస్థలో చేర్పించాడు. కళాశాల యాజమాన్యం ఏడాదికి రూ. 3లక్షలు డిమాండ్ చేసింది. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో తన సతీమణి మెడలోని బంగారం తాకట్టు పెట్టి ఫీజు చెల్లించాడు. మరో కుమార్తె ప్రస్తుతం 10వ తరగతి చదువుతోంది. ఆమెకు తిరుపతిలోని ప్రైవేటు పాఠశాలలో ఏడాదికి రూ.80వేలు ఫీజు చెల్లిస్తున్నాడు. చదువులను రూ.లక్షల పోసి కొనే దుస్థితి దాపురించడం దారుణమని ఆవేదన చెందుతున్నాడు.'
- శ్రీకాళహస్తికి చెందిన నరసింహులు చిరువ్యాపారి. ఆయన పెద్ద కుమారుడు ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్ రాశాడు. ఆశించిన ర్యాంక్ రాకపోవడంతో జిల్లాలోని పలు ప్రైవేటు కళాశాలలలో బీటెక్ సీఈసీ కోర్సు కోసం దరఖాస్తు చేయించాడు. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో సీఈసీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుకు విద్యార్థి సుముఖత చూపడంతో ఫీజు వివరాలను ఆరా తీశాడు. ఏడాదికి రూ.3.50లక్షలు ఫీజు కట్టాలని చెప్పారు. దీంతో తాను పొదుపు చేసుకున్న నగదుకు తోడు మరో రూ. 2లక్షలను బంధువుల దగ్గర రూ.5 వడ్డీకి తీసుకుని కళాశాలకు అడ్వాన్స్ రూపంలో చెల్లించి సీటు రిజర్వ్ చేసుకున్నాడు.



ఫీజులుం.. దారుణం

పిల్లలకు చదువు తప్ప ఇంకేం ఇవ్వగలం .. ఆస్తిపాస్తులు సమకూర్చలేని పరిస్థితుల్లో ఉన్నత విద్యను తప్ప ఇంకేం అందించగలం.. ఇదీ సగటు మధ్యతరగతి మనిషి ఆలోచనా విధానం. ఇదే అలుసుగా పలు విద్యాసంస్థలు కాసులు పోగేసుకుంటున్నాయి. అప్లికేషన్.. అడ్మిషన్.. టర్మ్ ఫీజుల రూపంలో తల్లిదండ్రులను నిలువునా దోచేస్తున్నాయి. ప్రస్తుతం అన్ని కాలేజీలు.. స్కూళ్లు ప్రారంభమైన సందర్భంగా ప్రవేశ రుసుము.. పుస్తకాలు.. అంటూ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. బిడ్డలకు చక్కటి భవిష్యత్ అందించేందుకు అమ్మానాన్నలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. విద్యార్థులకు అవసరమైనవన్నీ కొనుగోలు చేసేందుకు అధిక వడ్డీల భారం మోస్తున్నారు. బంగారు నగలతో పాటు పుస్తెలను సైతం తాకట్టు పెట్టుకుని చదువులను కొంటున్నారు.

- పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రుల ఇక్కట్లు
- ఫీజుల కోసం తీవ్రంగా ఒత్తిడి చేస్తున్న స్కూళ్లు.. కాలేజీ యాజమాన్యాలు
- విద్యాసంస్థల్లో చేర్పించేందుకు తప్పని అప్పులు
- అధిక వడ్డీలతో ఎడతెగని పాట్లు
- పుస్తెలు సైతం తాకట్టు పెడుతున్న మాతృమూర్తులు

తిరుపతి సిటీ : జిల్లాలో కేజీ నుంచి పీజీ వరకు అన్ని విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ పాఠశాలల్లో దాదాపు పూర్తికాగా, ఇంటర్, ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ, పీజీ కళాశాలలో ఇప్పుడిప్పుడే ప్రవేశాలు ఊపందుకుంటన్నాయి. తమ పిల్లలు ఇంజినీర్, డాక్టర్ కావాలనే కోరికలతో తల్లిదండ్రులు జిల్లాలోని పేరొందిన కార్పొరేట్ విద్యాసంస్థల వెంటపడుతున్నారు. దీంతో కళాశాల యాజమాన్యాలు తల్లిదండ్రుల అమాయకత్వాన్ని క్యాష్ చేసుకునేందుకు ఫీజులను ఆమాంతం పెంచి దండుకుంటున్నాయి. విద్యాసంస్థలు చెప్పినంత ఫీజు చెల్లించేందుకు తల్లిదండ్రులు వడ్డీ వ్యాపారులు, కుదువ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వడ్డీ వ్యాపారలు రూ.5 నుంచి రూ.10ల వరకు డిమాండ్ చేస్తూ ప్రామిసరీ నోట్లు రాయించుకుని, ఖాళీచెక్కులను తీసుకుని నగదు ఇస్తున్నారు. అలాగే ఫీజుల చెల్లింపులకు పలువురు ఇంటిలోని బంగారం తాకట్టు పెట్టేందుకు కుదువ వ్యాపారులను సంప్రదిస్తున్నారు. దీంతో జిల్లాలోని పాన్ బ్రోకర్ షాపులు సైతం ఈ నెల కళకళలాడుతున్నాయి. వారు కూడా బంగారును తాకట్టు పెట్టుకుని రూ.3లు నుంచి రూ.5 వడ్డీతో నగదు అందిస్తున్నారు. వడ్డీకి సైతం చక్రవడ్డీ వర్తిస్తుందని సంతకాలు తీసుకుంటున్నారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నాం



మాది అనంతపురం. 15ఏళ్లుగా తిరుపతిలో ఉంటున్నాం. భవన నిర్మాణ కూలీలుగా పనిచేసుకుంటూ బతుకీడుస్తున్నాం. ముగ్గురు పిల్లలు. పెద్ద అమ్మాయికి మా దగ్గర ఉన్న సొమ్ముతో ఇటీవలే పెళ్లి చేశాం. మూడో అమ్మాయి ప్రభుత్వ పాఠశాలలో పది చదువుతోంది. రెండో అమ్మాయి మంచి మార్కులతో ఈ ఏడాది ఇంటర్ పూర్తి చేసింది. కానీ, పైచదువులకు పంపాలంటే భయమేస్తోంది. అయితే మాలాగా కష్టం చేయకూడదని బాగా చదివించాలనే కోరిక ఉంది. ఇంజినీరింగ్ కళాశాలలో రూ.లక్షలు అడుగుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నమ్మకం పెట్టుకోవదని చెబుతున్నారు. దీంతో అప్పు కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నాం. **– శారద, భవన నిర్మాణ కూలీ, తిరుపతి**

వడ్డీకి తెచ్చాం



పిల్లలను చదివించాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మా అమ్మాయి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి వరకు చదివింది. పదో తరగతి కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చేర్పించాం. ఏడాదికి హాస్టల్‌తో పాటు మొత్తం ఫీజు రూ.1.80వేలు కట్టాల్సి వచ్చింది. దాచుకున్న రూ.50వేలకుతోడు మరో రూ.1.30వేలను వడ్డీవ్యాపారుల వద్ద రూ.5లకు వడ్డీకి తెచ్చి కట్టా. ప్రభుత్వ విద్యాసంస్థలు కార్పొరేట్ స్థాయిని అందుకుంటే ఇలాంటి పరిస్థితి రాదు. నేను చిన్న ఉద్యోగిని. నా భార్య దివ్యాంగురాలు. మా కష్టం పిల్లలకు రాకూడదని అప్పు చేసి చదివిస్తున్నాం.
– రామకృష్ణ, ప్రైవేటు ఉద్యోగి, గూడూరు

తిప్పలు తప్పడం లేదు



నేను తిరుపతిలోని ఓ ప్రముఖ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నా. నా భార్య సైతం ఓ ప్రైవేటు షాపులో పనిచేస్తోంది. ఇద్దరి జీతం నెలకు రూ.26వేలు వస్తాయి. మాకు ఇద్దరు ఆడపిల్లలు. ఓ అమ్మాయి పదో తరగతిని ఈ ఏడాది పూర్తి చేసింది. ప్రైవేటు కళాశాలలో ఎంపీసీలో చేర్పించాం. జేఈఈ మెయిన్స్ కోచింగ్ ఇస్తామని ఏడాదికి రూ.1.50లక్షలు చెప్పారు. ప్రస్తుతం అప్పు చేసి రూ.లక్ష కట్టాం. మరో అమ్మాయి ఇంటర్ పూర్తి చేసింది. ఇటీవల విడుదల చేసి నీట్ ఫలితాలలో 480మార్కులు సాధించింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వస్తుందని ఆశిస్తున్నాం. ఆ అమ్మాయి చదువు కోసం విలేజ్‌లో ఉన్న పొలాన్ని అమ్మకానికి పెట్టాం.
– శివశంకర్, డెలివరీ బాయ్, తిరుపతి రూరల్

చదువు కొనాల్సి వస్తోంది



విద్య వ్యాపారంగా మారిపోయింది. జూన్ వచ్చిందంటే మాలాంటి మధ్య తరగతి కుటుంబాల పరిస్థితి దారుణం. పిల్లల చదువులకు అప్పులకోసం వెతుకులాట తప్పడం లేదు. నేను తిరుపతిలో ఓ విద్యాసంస్థలో తాత్కాలిక అధ్యాపకురాలిగా పనిచేస్తున్నా. నా భర్త దివ్యాంగుడు. వచ్చే జీతం ఇంటి ఖర్చులు, బాడుగకు సరిపోతుంది. ఇద్దరు పిల్లలు. పెద్ద అబ్బాయి డిగ్రీ పూర్తి చేసి చిన్న కంపెనీలో పనిచేస్తున్నాడు. మరో కుమారుడు ఇంటర్ పూర్తి చేసి నీట్ కౌన్సెలింగ్ కోసం ఎదురు చూస్తున్నాడు. ప్రైవేటు కళాశాలలో సీటు వచ్చినా కనీసం రూ. 5లక్షలు కావాల్సిన పరిస్థితి. అందుకోసం ఇంట్లో బంగారం తాకట్టు పెట్టడంతో పాటు మరో రూ.2లక్షలు అప్పు చేయాల్సిందే. ఈ కాలంలో చదువును కొనాల్సి వస్తోంది. **– శ్రావణ భార్గవి, అధ్యాపకులు, తిరుపతి**

చదివించాలనే తపన



పిల్లలు మాలా కష్టాలు పడకుండా మంచి ఉద్యోగంలో స్థిరపడాలనే తపనతో అప్పులు చేసి ఉన్నతంగా చదివించేందుకు సిద్ధపడ్డాం. నా భర్త, నేను ఇద్దరం సొంతంగా తిరుపతిలో కిరాణా దుకాణం నడుపుతున్నాం. మాకు అబ్బాయి, అమ్మాయి కవల పిల్లలు. ఇద్దరూ ఈ ఏడాది పదో తరగతి పూర్తి చేశారు. ఒకరి డాక్టర్ చేయాలనే ఆశతో ఇంటర్ ప్రైవేటు కళాశాలలో బైపీసీ చేర్పించాం. ఏడాదికి రూ.2లక్షలు ఫీజు కట్టాం. అమ్మాయిని తిరుపతిలో ఓ ప్రైవేటు కళాశాలలో ఎంపీసీ చేర్పించాం. ఫీజు ఏడాదికి రూ. 1.50లక్షలు చెప్పారు. ఇందులో రూ. 2లక్షలకు బ్యాంకులో బంగారు తాకట్టు పెట్టాం.
– ద్రాక్షాయిణి, కిరాణా దుకాణం నిర్వాహకులు, రేణిగుంట

హామీల అమలులో విఫలం

- వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో చంద్రబాబు విఫలమయ్యారని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జీఆర్ భవన్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నేదురుమల్లి మాట్లాడుతూ రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో రాష్ట్రంలో సాగిస్తున్న అరాచకపాలనకు ప్రజలే చరమగీతం పాడుతారని స్పష్టం చేశారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేసేందుకే జగనన్న ఆదేశాల మేరకు రీకాల్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వివరించారు. జూలై 8వ తేదీన వెంకటగిరిలో రీకాల్ మేనిఫెస్టో చేపట్టనున్నట్లు వెల్లడించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పకడ్బందీగా నవరత్న పథకాలను అర్హులందరికీ అందించారని కొనియాడారు. ప్రస్తుత ంసీఎం చంద్రబాబు సంపద సృష్టిస్తానని, సూపర్‌సిక్స్ హామీలను నెరవేరుస్తాని బూటకపు హామీలు గుప్పించి, ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. కూటమి పాలనలో అన్ని వర్గాలు నష్టపోతున్నాయని స్పష్టం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం మినహా సర్కారు చేసింది శూన్యమని వెల్లడించారు. అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శించేందుకు నెల్లూరు వస్తున్న జగనన్నను అడ్డుకునేందుకు కూటమి నేతలు యత్నిస్తున్నారని మండిపడ్డారు. హెలీప్యాడ్ కోసం స్థలం ఇచ్చిన ఓ విద్యాసంస్థ యాజమాన్యంపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా జూలై 3వ తేదీన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

భవిష్యత్ వైఎస్సార్‌సీపీదే..

రాష్ట్రంలో 2027లోనే జమిలి ఎన్నికలు జరగనున్నట్లు నేదురుమల్లి రామ్‌కుమారెడ్డి స్పష్టం చేశారు. ఆ ఎన్నికల్లో అఖండ విజయం వరిస్తుందని వెల్లడించారు. భవిష్యత్ వైఎస్సార్‌సీపీదే అని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ ప్రసాద్‌రెడ్డి , వైస్ చైర్మన్ శాతరాసి బాలయ్య, పూజారి లక్ష్మి, రాపూరు, సైదాపురం, బాలాయపల్లి, డక్కిలి మండల కన్వీనర్లు మధుసూదన్‌రెడ్డి, మన్నారపు రవికుమార్‌యాదవ్, వెందోటి కార్తీక్‌రెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డి, నేతలు సదారెడ్డి,చిట్టేటి హరికృష్ణ, కౌన్సిలర్లు ఆవిశంకరయ్య, దనియాల రాధ, సుబ్బారావు, సుకన్య, సుభావలీ,అటంబాక శ్రీనివాసులు, నారాయణరెడ్డి, శ్రీనివాసులురాజు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

శ్రీసిటీకి పోలీస్ బాస్ ఎవరు?

- ఉద్యోగ విరమణ పొందిన హైటెక్ స్టేషన్ డీఎస్పీ
- నెల నుంచి ఖాళీగా పోస్టు



శ్రీసిటీలోని డీఎస్పీ కార్యాలయం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ పారిశ్రామిక నగరంగా దినదినాభివృద్ధి చెందుతోంది. ఇక్కడ శాంతిభద్రతల పరిరక్షణను డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షిస్తుంటారు. అయితే శ్రీసిటీలోని హైటెక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ పోస్టు నెల నుంచి ఖాళీగానే ఉంది. మే నెలాఖరున డీఎస్పీ పైడేశ్వరరావు ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి ఆ పోస్టు భర్తీ చేయలేదు. నాయుడుపేట డీఎస్పీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

ఎందుకీ నిర్లక్ష్యం

శ్రీసిటీలో ఇప్పటికే పలు దేశాలకు చెందిన 250 పరిశ్రమలు ఉన్నాయి. 70వేల మందికి పైగా ఉద్యోగులు ఉపాధి పొందుతున్నారు. పలు దేశాలకు చెందిన వ్యాపారవేత్తలతో పాటు రోజువారీ పారిశ్రామికవేత్తలు ఇతర ముఖ్యులు పర్యటిస్తుంటారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన శ్రీసిటీ పారిశ్రామికవాడలోని హైటెక్ పోలీస్ స్టేషన్‌కు నెల నుంచి డీఎస్పీని నియమించకుండా నిర్లక్ష్యం వహిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. అలాగే ఈ పోలీస్ స్టేషన్‌కు ఇప్పటి వరకు పూర్తిస్థాయి సిబ్బందిని కూడా భర్తీ చేయలేదు. ఇప్పటికైనా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి పారిశ్రామికపరంగా ఎంతో ప్రాధాన్యత గల శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్‌కు డీఎస్పీని నియమించాలని పలు పరిశ్రమల ప్రతినిధులు, ఉద్యోగులు కోరుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్‌ఓ నరసింహులు, ఇతర జిల్లా అధికారులు అర్జీలు స్వీకరించనున్నారు. అలాగే మండల , డివిజన్ కార్యాలయాల్లో సైతం గ్రీవెన్స్ చేపట్టనున్నారు.



అలరించిన బకాసుర వధ

శ్రీకాళహస్తీశ్వర అనుబంధ ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న తిరునాళ్లలో భాగంగా మూడో రోజు ఆదివారం బకాసుర వధ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. భీముడి వేషధారి ఎద్దుల బండిలో వీధుల్లో తిరుగుతూ భిక్షాటన చేసి అన్నం సేకరించి ధర్మరాజ స్వామి ఆలయం వద్దకు చేరుకున్నాడు. అనంతరం బకాసుర వధ ఘట్టం ప్రదర్శించారు. ఈ క్రమంలో పట్టణంలో సేకరించిన అన్న ప్రసాదం పంచిపెట్టారు. ఈ సందర్భంగా ధర్మరాజు, భీముడు, అర్జున వేషధారులు ఆలయం వద్ద కనువిందు చేశారు. అనంతరం అర్జునుడు మత్స్య యంత్ర ఛేదన ఘట్టం ప్రదర్శించారు. - శ్రీకాళహస్తి


బకాసుర వధ ఘట్టం



భిక్షాటన చేస్తున్న భీముడి వేషధారి

బాసరకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు

- జూలై 4 నుంచి తిరుపతి–నాందేడ్‌కు రాకపోకలు
- నూతన మార్గంలో మొదటి ప్రయాణం
- షిరిడీ సాయి భక్తులకు అనుకూలం



తిరుపతి అన్నమయ్యసర్కిల్: తెలంగాణా రాష్ట్రం బాసర క్షేత్రంలోని సరస్వతి దేవి దర్శనం చేసుకోవాలనుకునే భక్తులకు రైల్వేశాఖ తీపికబురు అందించింది. తిరుపతి నుంచి బాసరకు జూలై 4వ తేదీ నుంచి ప్రత్యేక రైలు అందుబాటులోకి రానుంది. తిరుపతి –నాందేడ్ మధ్యలో ప్రత్యేక రైలు నడిపేందుకు చర్యలు తీసుకుంది. ఈ రైలును పిడుగురాళ్ల–శావల్యపురం మధ్య నూతనంగా నిర్మించిన మార్గం ద్వారా మార్కాపురం, నంద్యాల, కడప, రేణిగుంట నుంచి మొదటిసారిగా తిరుపతికి నడపనున్నారు. జూలై 11, 18, 25 తేదీలలో తిరుపతికి, అదే నెల 6, 19, 20, 27 తేదీలలో నాందేడ్‌కు ప్రయాణిస్తుంది. షిర్డి వెళ్లాలనుకునే భక్తులు నాందేడ్ వరకు ప్రయాణించి అక్కడి నుంచి తక్కువ సమయంలో షిర్డి సాయిబాబాను దర్శించుకునేందుకు అనుకూలంగా ఉంటుంది.

రైలు రాకపోకల సమయం ఇలా...

నాందేడ్‌లో సాయంత్రం 4.30కి బయలు దేరి బాసర 6 గంటలకు, నిజామాబాద్ 6.25 గంటలకు చేరుకుంటుంది. కామారెడ్డి మీదుగా మేడ్చల్ రాత్రి 8 గంటలకు, చెర్లపల్లి 9.30 గంటలకు, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి మీదుగా పిడుగురాళ్లకు అర్థరాత్రి 12.30 గంటలకు చేరుకుంటుంది. దొనకొండ, మార్కాపురం రోడు, కంభం, గిద్దలూరు నుంచి నంద్యాలకు వేకువజాము 5.30 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి జమ్మలమడుగు, ఎర్రగుంట్ల మీదుగా కడపకు 8.30 గంటలకు వస్తుంది. రాజంపేట, కోడూరు, రేణిగుంట మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. అదే రైలు మళ్లీ తిరుగు ప్రయాణం తిరుపతిలో మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరి కడపకు 4.15కు చేరుకుని మరుసటి రోజు ఉదయం 7.45 గంటలకు చేరుకుంటుంది. మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు బయలుదేరి తిరుపతి వరకు ప్రయాణిస్తుంది.

క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రేణిగుంట : తిరుపతి– రేణిగుంట రహదారిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలో ఉన్న వైన్ షాప్‌లో వాచ్‌మన్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివరాలు.. తిరుపతి లీలా మహల్ సర్కిల్ వద్ద ఓ అపార్ట్‌మెంట్‌కు కాపలాగా ఉంటున్న కృష్ణారెడ్డి(65) రాత్రి వేళ రేణిగుంట సమీపంలోని వైన్ షాపులో వాచ్‌మన్‌గా పనిచేసేవాడు. ఆదివారం ఉదయం డ్యూటీ దిగిన తర్వాత గాయాలతో మృతి చెందడంపై కుటుంబీకులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు రూరల్ సీఐ మంజునాథరెడ్డి, గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగ అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి క్రైమ్ : కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్‌కు చెందిన కృష్ణప్ప రాజేష్ (23) అనే అంతర్రాష్ట్ర దోపిడీ దొంగను అరెస్ట్ చేసినట్లు తిరుపతి క్రైమ్ పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాలు.. ఈనెల 9వ తేదీన కాటన్ మిల్ సమీపంలో నివసిస్తున్న ఫరూక్ సొంత పనుల నిమిత్తం నెల్లూరుకి వెళ్లడంతో ఆయన ఇంట్లో చోరీ జరిగింది. పలు వస్తువులతోపాటు ద్విచక్రవాహనం అపహరణకు గురైంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నగరంలోని హరేరామ హరే కృష్ణ మందిరంలో సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న కృష్ణప్ప రాజేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా పలు నేరాలు బయటపడ్డాయి. నిందితుడిపై ఇదివరకే తిరుపతిలో మూడు కేసులు నమోదయ్యాయని, పలు జిల్లాల్లో దోపిడీలకు సంబంధించి జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు నిందితుడి నుంచి ద్విచక్రవాహనంతోపాటు 11 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు.



గుడిపాల వద్ద తమిళనాడు సరిహద్దును తాకిన ట్రాక్టర్లు

కళ్లు కాయలు

మామిడి రైతులు దిగుబడుల విక్రయానికి అగచాట్లు పడుతున్నారు. ఫ్యాక్టరీల వద్ద రోజుల తరబడి పడిగాపులు పడుతున్నారు. మామిడి అన్‌లోడింగ్ కోసం వాహనాలతో క్యూ కట్టారు. తిండీ తిప్పలు రోడ్డుపైనే చేస్తూ..కంటి మీద కునుకు లేకుండా జాగరణ చేస్తున్నారు. మా వంతు ఎప్పుడు వస్తుందా అని కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. అన్నదాత ఇల్లు వదలి నాలుగు రోజులుగా రోడ్డు మీదే తిప్పలు పడుతున్నారు. ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ కాయలను అమ్ముకునేందుకు రైతుల అగచాట్లు అన్నీఇన్నీ కావు. రోజుల తరబడి రోడ్డుమీద ఉండడంతో వాహనాల్లోనే కాయలు పండుగా మారుతున్నాయి..మరోవైపు తోటల్లో కాయలు కోతకు వస్తుండడంతో ఈ బాధ లేంటి దేవుడా అని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

కాయలు కోతకోస్తే కన్నీళ్లే

- అమ్మకానికి రోడ్డునపడ్డ రైతులు
- రోజుల తరబడి రోడ్డుపైనే తిండీ తిప్పలు
- వెంటాడుతున్న దొంగల భయం
- కునుకు తీయని అన్నదాతలు

కాణిపాకం : ఉమ్మడి జిల్లాలో మామిడి రైతు సుడిగుండంలో చిక్కుకున్నారు. వీరి సమస్యలు తీరని వెతలుగా మారాయి. కాయలు కోతకొస్తే రైతులకు కన్నీళ్లు ముంచుకొస్తున్నాయి. ఫలం విక్రయానికి రోడ్డున పడుతున్నారు. రోజుల తరబడి రోడ్డుపైనే కునుకు తీస్తున్నారు. గొంతు తడుపుకోవడానికి, తిండికి తిప్పలు పడుతున్నారు. దీనికి తోడు దొంగల భయం వెంటాడుతోంది. కునుకు వేసేందుకు వణుకుతున్నారు. మామిడి విక్రయాలకు అన్నదాత అగచాట్లు పడుతున్నారు. మామిడి పంటను సాగులోకి తెచ్చేందుకు అష్టకష్టాలు పడ్డారు. ఆ కష్టానికి ప్రతిఫలం ఆస్వాదించ లేకపోతున్నారు. పంట కోతకొచ్చే సరికి పడరానిపాట్లు పడుతున్నారు. నిద్రలేని రాత్రులను గడుపుతున్నారు. కొన్నిరోజులుగా జిల్లాలోని మామిడి రైతుల పరిస్థితి ఇలా తయారైంది. ఇల్లు..వాకిలి వదిలి రోడ్డుపైనే కునుకుతీస్తూ...మామిడి పంటను అమ్ముకోవడానికి వారు అవస్థలు పడుతున్నారు.

ఫ్యాక్టరీల వద్ద వరుస కట్టి..

ఉమ్మడి జిల్లాలో 43 ఫ్యాక్టరీలుంటే..ఇందులో 31 ఫ్యాక్టరీలు మాత్రమే తోతాపురిని కొనుగోలు చేస్తున్నాయి. ఈ ఫ్యాక్టరీల ఎదుట రైతుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. గుడిపాల మండలం గొల్లమడుగు ప్రాంతంలోని ఓఫ్యాక్టరీ వద్ద రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సుమారు 700కు పైగా ట్రాక్టర్లు రోడ్డుకు ఇరువైపులా ఫ్యాక్టరీ గేటు నుంచి తమిళనాడు సరిహద్దును తాకాయి. జీడీ నెల్లూరులోని ఎట్టేరి వద్ద పరిస్థితి తీవ్రతరమవుతోంది. ట్రాక్టర్ల బారులు తీరడంతో తోతాపురి ట్రాక్టర్లోనే పండవుతోంది. పూతలపట్టు, చిత్తూరు, తవణంపల్లి, ఐరాల, పెనుమూరు, కార్వేటినగరం వద్ద ఉన్న ఫ్యాక్టరీల వద్ద వందల సంఖ్యలో ట్రాక్టర్లు రోడ్లను ఆక్రమించాయి. ఈ రకంగా క్యూ కట్టడంతో రైతులు రోజులు తరబడి రోడ్డుకే పరిమితమయ్యారు. కాయలు అన్‌లోడింగ్ అయ్యేందుకు 5,6 రోజుల సమయం కావడంతో రైతులు రోడ్డుపైనే బస చేస్తున్నారు.



గుడిపాల గొల్లమడుగు వద్ద క్యూకట్టిన ట్రాక్టర్లు

గుక్కెడు నీటికి గగనమే

జిల్లా నలుమూలల నుంచి రైతులు వారు పండించిన పంటను కోత కోసి ఫ్యాక్టరీలకు అమ్మకానికి పెడుతున్నారు. ఈ తరుణంలో ఫ్యాక్టరీల వద్ద రైతులు అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ప్రధానంగా తాగునీటికి కూడా రైతులు ఇబ్బంది పడుతున్నారు. గొంతు తడుపుకోవడానికి కి.మీ మేర వెళ్లి తాగునీటిని కొని తెచ్చుకుంటున్నారు. చుట్టూ పక్కల, రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి దుకాణాల్లో లేకపోవడంతో రోడ్లమీద వచ్చే వాహనాలను ఆశ్రయించి నీళ్ల బాటిళ్ల కోసం పరుగులు పెడుతున్నారు. అక్కడ కాలకృత్యాలకు కూడా వాటర్ బాటిళ్లే దిక్కుగా మారాయి. అలాగే ఆకలితో అలమటిస్తున్నారు. కడుపు నింపుకోవడానికి కూడా చాలా మంది హోటల్ వైపు చూస్తున్నారు. ఫ్యాక్టరీ వాళ్లు పంచి పెడుతున్న భోజనం పట్టక పలువురు హోటల్‌కు వెళ్తున్నారు. ఇలా రోజూ వారీగా రూ.700 వరకు ఖర్చు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

రెప్పవేస్తే ఒట్టు..

బండి క్యూలో పెట్టిన రోజు నుంచి అన్‌లోడింగ్ అయ్యే వరకు రైతు కంటిపై రెప్పవేయడం లేదు. పగలు అలా కొద్ది సేపు బండి కిందే నిద్రోతున్నారు. రాత్రుల్లో నిద్ర పట్టక అల్లాడిపోతున్నారు. కంటిపై రెప్పవేస్తే ఆ మార్గాల్లో రయ్..రయ్ మంటూ వెళ్లే వాహనాల శబ్దాలకు ఉలిక్కిపడుతున్నారు. బలమైన గాలులు, వర్షాలకు అవస్థలు పడుతున్నారు. ఎండకు విలవిలలాడిపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో కనీస నీడలు లేక ట్రాక్టర్ కింద భాగంలో తలదాచుకుంటున్నారు.

దొంగల భయం

రైతులకు కాయల కష్టంతో పాటు దొంగల భయం వెంటాడుతోంది. బండి వదిలి ఒక్క అడుగు ముందు వేసేందుకు వందసార్లు ఆలోచిస్తున్నారు. రాత్రి పూట బండిని వదిలి పక్కకు వెళ్లి కునుకు తీసేందుకు సాహసం చేయలేకపోతున్నారు. అలా బండి పైనే పడుకుని కాపాల కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. గుడిపాల మండలంలోని ఫ్యాక్టరీలు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నాయి. జీడీ నెల్లూరులోనూ జాతీయ రహదారి పక్కనే ఫ్యాక్టరీ ఉంది. తద్వారా దొంగతనాలు జరగవచ్చునని రైతులు వణికిపోతున్నారు. ట్రాక్టర్లు, అందులోని పరికరాలు చోరీ అవుతాయని బండిని వదిలి వెళ్లలేకపోతున్నారు. ఈ భయం గుప్పెట్లో ఇళ్లు వాకిలి మరిచిపోయారు. శుభకార్యాలను వదులుకుంటున్నారు. బంధువులు చనిపోతే కూడా వెళ్లలేని పరిస్థితి దాపురించింది. ఇలా రైతులు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు.

నిద్రపోయి మూడు రోజులైంది..



నేను 1.50 టన్ను కాయలే తెచ్చాను. దానికి కోసం నాలుగు రోజులుగా ఈడే ఉన్నా. నిద్రపోయి మూడు రోజులు అయింది. తిండి తినాలంటే కి.మీ నడవాలి. హోటల్‌కు వెళ్లి తింటున్నా. తాగేదానికి నీళ్లు తెచ్చుకోవాల్సిందే. దీనికి ప్రతి రోజు రూ.700 వరకు ఖర్చు అవుతోంది. ఈ అడవిలో ఉండలేకపోతున్నాం. గాలి ఒక్క పక్క. మరో పక్క ఎండలు. రాత్రుల్లో దొంగలు వస్తారని భయం. ఏం చేయాలి..అవస్థలు పడుతున్నాం. – గోవిందస్వామినాయుడు, ఏఎల్‌పురం, గుడిపాల

రోడ్డు మీదే అన్నీ



నాకు 7 ఎకరాల మామి డి తోట ఉంది. ఇప్పటికి ఒక లోడ్ కాయలను తోలాను. ఇప్పుడు మరో లోడ్ కాయలు తెచ్చాను. మూడు రోజులు అయింది. ఈ రోజుతో నాలుగో రోజు. కాయలు అన్‌లోడింగ్ అయ్యేందుకు మరో రెండు రోజులు పడొచ్చు. అంతా వరకు ఈ కష్టాలు తప్పవు. నీళ్లు పోసుకుని మూడు రోజులు అయింది. ఏదైనా తినాలన్న తమిళనాడు బార్డర్ నుంచి కి.మీన్నర వెళ్లాలి. – లక్ష్మణన్, మాపాక్షి, చిత్తూరు

రోజుల తరబడి పడిగాపులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 56 వేల హెక్టార్లల్లో మామిడి పంట వ్యాపించి ఉంది. ప్రధానంగా తోతాపురి 39,895 హెక్టార్లల్లో సాగవుతోంది. తద్వారా 4,9,274 మెట్రిక్ టన్నుల కాయలు దిగుబడి అయిందని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ దిగుబడులను విక్రయించడానికి ఈ సారి రైతులు ముప్పు తిప్పలు పడుతున్నారు. కాయ కోతకోసి ఫ్యాక్టరీ వద్దకు తీసుకెళితే పడిగాపులు కాస్తున్నారు. వందలాది ట్రాక్టర్లు మామిడి కాయలతో క్యూ కడుతున్నాయి. ఈ గందరగోళంలో కాయలను అన్‌లోడింగ్ చేసేందుకు రైతులు రోజులు తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఒక్కోసారి అన్‌లోడ్ చేసే సరికే కాయలు కుళ్లిపోతున్నాయి.





ట్రాక్టర్ల వద్దే నిద్రపోతున్న రైతులు

అన్‌లోడింగ్‌కు ఐదు రోజులు



అన్‌లోడ్ కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు

గుడిపాల : గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్, తాసా జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద ట్రాక్టర్లు బారులు తీరి కిలో మీటర్ల మేర ఉన్నాయి. ఫ్యాక్టరీకి సంబంధించి చిత్తూరు–వేలూరు రహదారిపై ట్రాక్టర్లు బారులు తీరగా, తాసా జ్యూస్ ఫ్యాక్టరీకి సంబంధించి చెన్నై–బెంగుళూరు జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ఒక్కో ట్రాక్టర్ అన్‌లోడింగ్ సంబంధించి అయిదు రోజులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటితో ముగియనున్న బదిలీల ప్రక్రియ

- జూలై మొదటి వారం నుంచి జాయినింగ్‌లు

తిరుపతి అర్బన్: సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ సోమవారంతో ముగియనుంది. ఈ నెల 27 నుంచి 30 వరకు ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లా కేంద్రాల్లో ఆయా విభాగాల వారిగా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. జూలై 1న బదిలీల జాబితాను వెల్లడించనున్నారు. ఈ క్రమంలో జూలై మొదటి వారంలో బదిలీ అయిన కొత్త స్థానాల్లో సచివాలయ ఉద్యోగులు బాధ్యతలు స్వీకరించాల్సి ఉంటుంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో స్పష్టత లేకుండా పోయిందని పలువురు మండిపడుతున్నారు. జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలో ప్రస్తుతం 4530 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సాధారణంగా ప్రొబేషన్ పిరియడ్‌ను పరిగణలోకి తీసుకోకుండా ఐదేళ్లు పూర్తి అయిన వారిని మాత్రమే బదిలీలు చేయాల్సి ఉంది. అలా కాకుండా ప్రొబేషన్ పిరియడ్‌ను పరిగణలోకి తీసుకుని బదిలీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో 82 శాతం మంది ఉద్యోగులకు బదిలీలు తప్పడం లేదు. సర్కార్ సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఇటీవల విడదల చేసిన జీవో నంబర్ 5ను రద్దు చేయాలని ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ జీవో ప్రకారం సొంత మండలంలో పనిచేయకుండా పక్క మండలంలో పనిచేయడానికి ఆప్షన్ పెట్టుకోవాల్సి వచ్చిందని పలువురు ఆవేదన చెందుతున్నారు. సాధారణంగా గెజిటెడ్ స్థాయి అధికారులు అయితేనే సొంత మండలంలో పనిచేయకుండా పక్క మండలాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉందని.. సచివాలయ ఉద్యోగులకు గెజిటెడ్ అధికారుల రూల్‌ను ప్రవేశపెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అర్బన్ ప్రాంతాల్లో మాత్రం మరో అర్బన్ ప్రాంతానికి వెళ్లకుండా పక్క వార్డుకు బదిలీ ఆప్షన్ పెట్టుకునే వెసులుబాటు కల్పించారు. ఉద్యోగుల బదిలీల్లో స్పష్టత లేకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా బదిలీల సందర్భంలో సీనియారిటీ వివరాలను డిస్‌ప్లే చేయాల్సి ఉంది... అలాగే ఖాళీల వివరాలు డిస్‌ప్లే ద్వారా వెల్లడించకుండానే బదిలీల కోసం ఐదేళ్లు పూర్తి అయినవారంతా ఆప్షన్లు పెట్టుకోవాలని ఆదేశాలు ఇవ్వడంపై పలువురు ఉద్యోగులు తీవ్రంగా మండిపడుతున్నారు. ముందే క్లస్టర్ల పేరుతో సచివాలయాలు కుదింపుకు రంగం సిద్ధం చేశారు. రెవెన్యూ డివిజన్లు వారీగా చూస్తే తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలో 245 సచివాలయాలను 124గా, శ్రీకాళహస్తిలో 154 సచివాలయాలను 81గా, సూళ్లూరుపేటలో 137 సచివాలయాలను 67గా, గూడూరులో 155 సచివాలయాలను 77గా కుదింపు చేయడానికి నివేదికను జిల్లా నుంచి విజయవాడకు పంపించిన సంగతి తెలిసిందే. మొత్తంగా జిల్లాలో 691 సచివాలయాలు 349 కానున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ తరుణంలో తొలగించనున్న సచివాలయానికి బదిలీ ఆప్షన్ పెట్టుకుంటే..భవిష్యత్‌లో వాటిని తొలగిస్తే వచ్చే ఇబ్బందులపై పలువురు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు బదిలీల అంశంలో తమ్ముళ్ల సిఫార్సు లెటర్లకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జోరుగా చర్చసాగుతుంది.

అరుపులు.. కేకలతో కౌన్సెలింగ్!

- మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల్లో గందరగోళం

చిత్తూరు అర్బన్ : సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శుల (ఎంఎస్‌కే) బదిలీ కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి అయిదేళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగులకు ఆదివారం చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో (డీపీఓ) కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు న్యాయం జరగడంలేదంటూ పలువురు ఉద్యోగుల అరుపులతో డీపీఓ దద్దరిల్లింది. దీంతో చిత్తూరు ఎస్పీ మణికంఠ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సచివాలయాల కుదింపు

చిత్తూరు, తిరుపతి, మదనపల్లెతో కూడిన పూర్వపు ఉమ్మడి జిల్లాలో దాదాపు 1,154 సచివాలయాలు ఉంటే.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటి సంఖ్యను 400 కుదించే ప్రయత్నం మొదలుపెట్టింది. దీనికితోడు అయిదేళ్ల పాటు ఒకేచోట పనిచేస్తున్న ఎంఎస్‌కేలను తప్పనిసరిగా బదిలీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన బదిలీల కౌన్సెలింగ్ చిత్తూరు ఎస్పీకు అప్పగించారు. అప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధించిన సిఫార్సు లేఖలను పలువురు ఉద్యోగులు తీసుకువచ్చి అధికారులకు అందిజేశారు. ఈ క్రమంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఎంఎస్‌కేలకు నో–ఆప్షన్ ఇవ్వాలని ఆయా కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. దీంతో డెప్యుటేషన్‌పై ఉన్న ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. తమను ఇష్టానుసారం ఎక్కడంటే అక్కడికి బదిలీ చేస్తున్నారంటూ కేకలు వేస్తూ ఆందోళనకు దిగారు. సచివాలయాలను కుదిస్తే తాము ఎక్కడికి వెళ్లి పనిచేయాలని ప్రశ్నించారు. ఇక స్పౌజ్ (భార్య, భర్త ఉద్యోగులు) కేసుల్లో ఆర్మీలో పనిచేసే వాళ్లను పరిగణలోకి ఎలా తీసుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎవరికైనా చెప్పుకోండి..

ఉద్యోగుల కేకలు వేస్తూ రచ్చ చేయడంపై ఎస్పీ మణికంఠ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని జిల్లాల్లో బదిలీ కౌన్సెలింగ్ ఆఫ్‌లైన్‌లో చేస్తుంటే, తాము ఖాళీలను చూపిస్తూ ఆన్‌లైన్‌లో సవ్యంగా చేస్తున్నామన్నారు. బదిరులు, అంగవైకల్యం, భర్తను కోల్పోయిన వాళ్లకు తొలి ప్రాధాన్యత ఇచ్చి, ఆపై మిగిలిన పోస్టులను జనరల్ ఉద్యోగులతో బదిలీలు చేస్తున్నట్లు తెలిపారు.గొడవలు చేసేవారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక సోమవారం మరో 200 మందికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. బదిలీల్లో కూటమి ప్రభుత్వం జారీ చేసిన తికమక ఉత్తర్వులు, సచివాలయాల కుదింపు నిర్ణయం.. ఉద్యోగులను అభద్రతాభావానికి గురిచేసింది.

ఇంటర్వ్యూకు రాకుంటే తొలగిస్తాం

తిరుపతి సిటీ : ఎస్వీయూ అకడమిక్ కన్సల్టెంట్లకు ఫర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో మంగళవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఆదివారం ఈ సందర్భంగా రిజిస్ట్రార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కన్సల్టెంట్లు ఇంటర్వ్యూకు రాకుంటే వెంటనే విధుల నుంచి తొలగిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు తాత్కాలిక అధ్యాపకులకు సమాచారం అందించారు. మంగళవారం 43మందికి, 2వతేదీ 51మందికి, 3న 47మందికి, 4న 51మందికి, 5వ తేదీన 51మంది తాత్కాలిక అధ్యాపకులకు వీసీ ఛాంబర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

దొరవారిసత్రం : స్థానిక రైల్వే స్టేషన్‌కు సమీపంలో 30ఏళ్ల నుంచి 35 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి చెన్నైకి వెళుతున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. స్థానిక రైల్వే సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సూళ్లూరుపేట జీఆర్పీ ఎస్ఐ చెన్నకేశవ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'కౌటిల్య' విద్యార్థులకు ఐఐఎం అడ్మిషన్లు



తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లోని కౌటిల్య విద్యాసంస్థ విద్యార్థులు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) బిజినెస్ స్కూళ్లల్లో ఎంబీఏ అడ్మిషన్లు పొందారు. గత ఏడాది నవంబరులో జాతీయ స్థాయిలో నిర్వహించిన క్యాట్ పరీక్ష తుది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి ఐఐఎంలలో అడ్మిషన్లు సాధించినట్లు కౌటిల్య విద్యాసంస్థ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. జి.వెంకట నితీష్ ఐఐఎం రాంచి, కె.హారికారాజు ఐఐఎం సిరమౌర్, భవ్యశ్రీ నిశిత, కె.కార్తీక్ ఐఐఎం నాగపూర్, ఐఐఎం సిర్మార్, పూణెలోని సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్‌కు జి.అభినయ్ సుప్రీత పీఎస్.సుదర్శన్ అడ్మిషన్లు సాధించినట్లు వివరించారు. క్యాట్ పరీక్ష, ఐఐఎంలలో అడ్మిషన్లకు సంబంధించి ఉచిత గైడెన్స్‌కు 96981 23456 నంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఐఐఎంలలో సీట్లు సాధించిన విద్యార్థులను బోధనా సిబ్బంది ఎన్.హరి, ఎన్ఎస్.రెడ్డి అభినందించారు.


త్వరలోనే జూనియర్స్ సీపీఎల్–1



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీడీసీఏ ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వేదికగా త్వరలోనే జూనియర్స్ చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్–1) పోటీలు నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఓ హోటల్‌లో సీపీఎల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో సీపీఎల్–1 విజయవంతంగా నిర్వహించామన్నారు. దీంతో ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఏ)కు తొలిసారిగా 60మంది క్రికెటర్లు రిజిస్టర్ చేసుకోవడం గర్వకారణమని చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఏపీఎల్, ఐపీఎల్‌లో ఎక్కువ మంది ఆడాలనే లక్ష్యంతోనే సీపీఎల్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇదే స్ఫూర్తితో చిన్న వయసు నుంచే క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 12 ఏళ్ల నుంచి 16ఏళ్ల లోపు క్రికెటర్లతో జూనియర్స్ సీపీఎల్–1 పోటీలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మ్యాచ్‌లు సైతం టీ–20 ఫార్మాట్‌లోనే ఉంటాయని, ప్రత్యక్ష ప్రసారం సైతం చేయనున్నట్లు తెలిపారు. 8 టీమ్‌లను ఫ్రాంచైజీ ద్వారా దక్కించుకోవడానికి ఆసక్తి గలవారు ముందుకు రావాలని కోరారు. పూర్తి వివరాలకు 88861 85559, 90002 14966నంబర్లలో సీడీసీఏ జాయింట్ సెక్రటరీ సతీష్ యాదవ్, సునీల్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వూకా విజయ్‌కుమార్, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, సీడీసీఏ కార్యదర్శి రవి, కోశాధికారి గిరిప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, శ్రీధర్ పాల్గొన్నారు.

మహిళా క్రికెటర్లకు మరింత ప్రోత్సాహం



క్రికెటర్లను అభినందిస్తున్న సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్

తిరుపతి ఎడ్యుకేషన్ : క్రికెట్‌లో పురుషులతో సమానంగా మహిళా క్రీడాకారులు రాణిస్తున్నారని, వారిని మరింతగా ప్రోత్సహిస్తామని, తద్వారా ఉన్నత స్థాయికి ఎదుగుతారని చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 9నుంచి 15వ తేదీ వరకు ఏసీఏ సౌత్ జోన్ అండర్–15 ఉమెన్స్ వన్డే రాష్ట్ర స్థాయి పోటీలను నెల్లూరులో నిర్వహించారు. ఈ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు వరుసగా నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కడపపై జట్లపై విజయం సాధించి ఫైనల్ విజేతగా నిలిచింది. ఆదివారం ఈ మేరకు జట్టు సభ్యులను సీడీసీఏ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళా క్రీడాకారులకు మరింత సదుపాయాలు కల్పించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఉమెన్స్ క్రికెట్ అకాడమీ నెలకొల్పేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మహిళా క్రికెటర్లు ఈ విజయ స్ఫూర్తితో అన్ని ఫార్మాట్‌లలో రాణించాలని ఆకాంక్షించారు.